ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 9 డిసెంబరు 2024



నేటి నుంచి ఉండి రైల్వేగేటు మూసివేత

ఉండి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉండి రైల్వేగేటు మరమ్మతుల కారణంగా ఈ నెల 9 నుంచి 18 వరకు మూసివేయనున్నారు. వాహనాల రాకపోకలు దారి మళ్లించినట్లు ఎస్‌ఐ నజీరుల్లా తెలిపారు. భీమవరం నుంచి ఉండి మీదుగా ఆకివీడు వెళ్లే వాహనాల పెదఅమిరం పుంత, కాళ్ల, ఏలూరుపాడు, మీదుగా వెళతాయి. గణపవరం నుంచి ఉండి మీదుగా పాములపర్రు, పెదకాపవరం మీదుగా ఆకివీడు వాహనాలు వెళతాయని సూచించారు.



కావిడి ఉత్సవంలో భాగంగా ఆలయం నుంచి తిరువీధులకు పయనమైన భక్తులు, బాలలు

కావిడి ఉత్సవం

ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'సుబ్రహ్మణ్యం మాం పాహి...స్వామినాథ మాం పాహి'.. అంటూ భక్తులు కావిడితో శ్రీవారి క్షేత్రంలో ఆదివారం తిరుగాడారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో జరిగిన కావిడి ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. సంప్రదాయబద్ధంగా పంచె, కండువా ధరించి ఈ సేవలో పాల్గొన్న భక్తులకు ఆలయంలో అర్చకులు వేదమంత్రోచ్ఛ రణలతో కావిడి అందజేశారు. సుబ్రహ్మణ్యుడి చిత్రపటంతో ఆయన నామాలను స్మరిస్తూ క్షేత్రంలో తిరుగగా వారి పాదాలను పలువురు భక్తులు కడిగి భక్తిభావాలను చాటారు. బాలలు సైతం పాల్గొనడం విశేషం.

11 నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలు వచ్చే నెల 13 నుంచి జరగనున్న నేపథ్యంలో ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 25 వరకు అమ్మవారి మూల విరాట్ దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మినగేష్ తెలిపారు. 11న ఉదయం 11 గంటలకు అమ్మవారి కళాపకర్షణ చేస్తారని, 24 వరకు ఉత్సవమూర్తికి నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహిస్తారని తెలిపారు. 25న ఉదయం విశేష పూజల అనంతరం అమ్మవారి కళలను విగ్రహంలో నిక్షిప్తం చేసి కుంభ, గో, దర్పణ దర్శనం కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు అమ్మవారి మూల విరాట్ దర్శనం కల్పిస్తామన్నారు.

పృథ్వీ శ్రీచక్రార్చన: మావుళ్లమ్మ ఆలయంలో ఆదివారం పృథ్వీ శ్రీ చక్రార్చన పూజ నిర్వహించారు. హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన నవగోపికా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి దీపాలను వెలిగించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో వేద పండితు లు కలెక్టర్ నాగరాణికి ఆశీర్వచనం అందజేశారు.



దీపాలను వెలిగిస్తున్న కలెక్టర్ నాగరాణి

వామ్మో జ్వరం



- పెరుగుతున్న బాధితులు
- ఫీవర్ సర్వే ఎక్కడ..?

అత్తిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో సీజనల్ వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. దోమలు పెరగడం వ్యాధులు వ్యాప్తికి ప్రధాన కారణం. సమీపంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద వైద్య సేవలు పొందుతున్నారు. మంచిలి పీహెచ్‌సీ పరిధిలోని ఆరవల్లి, ఉనికిలి, స్కిన్నెరపురం తదితర గ్రామాల్లో జ్వరాల బాధితులు అధికంగా ఉన్నారు. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ వైరల్ ఫీవర్, మలేరియా కేసులు కూడా ఉన్నట్లు సమాచారం.

ఆర్‌ఎంపీ, పీఎంపీలే శరణ్యం

ప్రతి గ్రామంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల వద్ద ప్రతి రోజు వందల మంది జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. దీనితో బాధితుల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు కావడం లేదు. మండలంలో వ్యాధుల బారిన పడినవారు ఇతర ప్రాంతాలలో చికిత్స పొందుతున్నారు.

జాడలేని ఫీవర్ సర్వే!

వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో జ్వరాల పరిస్థితి అవగాహన కోసం ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. కుటుంబంలో ఎవరికైనా జ్వరాలు, వ్యాధులు ఉన్నాయా తెలుసుకునే అవకాశం ఉంది. కాని ప్రస్తుతం పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఎంతో మందికి వైరల్ ఫీవర్ ఉందో కూడా అధికారికంగా లెక్కలు తేలడం లేదు. కేవలం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన కేసులు నమోదు చేసుకుని మమ అనిపిస్తున్నారు.

వితంతు పెన్షన్ మంజూరు
సులభతరం



- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- దరఖాస్తు లేకుండా ఆన్‌లైన్‌లో ఆమోదం
- జిల్లాలో 49,096 మందికి పింఛన్లు
- 217 మందికి పెండింగ్

భీమవరంటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టిఆర్ భరోసా పేరిట అందిస్తున్న పెన్షన్‌ల్లో వితంతు పింఛన్ దరఖాస్తు, మంజూరును ప్రభుత్వం సులభతరం చేసింది. వితంతు పింఛన్ పొందడానికి గతంలో నెలల సమయం పట్టేది. అర్హులు దరఖాస్తు చేసుకోవడం, సంబంధిత సెక్రటరీ ఆన్‌లైన్ చెయ్యడం, తరువాత ఎంపీడీవో పరిశీలించి ఆమోదం తెలిపితే మంజూరయ్యేది. కూటమి ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికింది. వితంతువుకు వెంటనే పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎవరైనా పెన్షన్‌దారు మరణిస్తే సంబంధిత వ్యక్తి మరణ తేదీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మృతుడి భార్యకు పెన్షన్ ఇచ్చేందుకు అర్హత ఉందని వెంటనే సంబంధిత అధికారికి ఆప్షన్ కనిపిస్తుంది. ఆమె ఆధార్ నెంబరు నమోదు చేసి, వివరాల ప్రకారం అర్హత నమోదు చేస్తే ఎంపీడీవో లాగిన్‌కు వెళుతుంది. సంబంధిత అధికారి పరిశీలించి ఆమోదం తెలిపితే మరుసటి నెల నుంచి ఆమెకు వితంతు పింఛన్ అందుతుంది. దరఖాస్తు లేకుండా ఎవరిని ఆశ్రయించకుండా పెన్షన్ మంజూరయ్యేలా ప్రత్యేక యాప్ ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధానంలో ఎటువంటి జాప్యం లేకుండా పెన్షన్ అందించడం వల్ల భర్తను కోల్పోయిన వారికి భరోసా ఇచ్చినట్లు అవుతుందని ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. 2014నుంచి 2019 వరకు ఈ విధానం ఉండేది. ప్రభుత్వం మారిన తరువాత దరఖాస్తు చేసుకోవడం, పరిశీలన తదితర అంశాల ఆధారంగా కొంత సమయం పట్టేది. దీనివల్ల పెన్షన్ మంజూరు అవుతుందా లేదా అనే ఆందోళన ఉండేది. ప్రస్తుతం పింఛన్ అర్హత, మంజూరు సమాచారంతో వారికి భరోసా లభిస్తుంది.

జిల్లాలో 217 మంది

వితంతు పింఛన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వారు 217 మంది ఉన్నారు. వారిలో 192 మందికి మంజూరకు ఆమోదం లభించింది. ఇంకా 25 మందికి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా వెంటనే ఆమోదం లభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రస్తుతం 49069 మందికి పెన్షన్

జిల్లా వ్యాప్తంగా వితంతు పింఛన్ 49,069 మందికి 4వేలు చొప్పున అందిస్తున్నారు. వారికి ప్రతినెల రూ.19.76 కోట్లు అందిస్తున్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఖాతాదారుల ఆందోళన (ఫైల్)

రుణ మాయ

తాడేపల్లిగూడెం బంధన్ బ్యాంకు మాయాజాలం

- ఖాతాదారులకు కొంత రుణం
- మిగిలినది ఎవరి జేబులో..?
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన వివాదం
- న్యాయం చేస్తామన్న బ్యాంకు అధికారులు
- సర్దుతారా.. సర్దేస్తారా..!

తాడేపల్లిగూడెం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం బంధన్ బ్యాంకు ఖాతాదారులకు రుణాలు ఇస్తామంటూ ఆశ చూపారు. వద్దన్నవారికి వడ్డీ తక్కువ అంటూ ఎర వేశారు. ఏదొక అవసరానికి ఉపయోగపడతాయని ఆశ పడ్డ ఖాతాదారులకు కనిష్ఠంగా రుణం ఇచ్చి గరిష్ఠ పరిమితిలో రుణ మొత్తం బ్యాంకు సిబ్బంది మాయం చేశారు. ఖాతాదారులు చెల్లించిన నెల వాయిదాలు కూడా బ్యాంకులో జమకాకపోవడంతో ఆరా తీసిన ఖాతాదారులకు దిమ్మతిరిగే విషయం తెలిసింది. వారి పేరుతో రుణాలు తీసుకుని బ్యాంకు అధికారులే కాజేస్తున్నారని బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. సాంకేతిక కారణం అంటూ కొన్నాళ్లు దాట వేశారు. చివరికి మేనేజర్ బదిలీకి ప్రయత్నించడంతో ఖాతాదారులు బ్యాంకులోనే ఉంచి తాళంవేసి నిర్బంధించడం విషయం వెలుగులోకి వచ్చింది.

అసలు మోసం ఇలా..

బ్యాంక్ ఖాతాదారు అవసరాలకు బ్యాంకు నుంచి గరిష్ఠ పరిమితిలో రూ.2 లక్షలు రుణం మంజూరు చేయవచ్చు. ఖాతాదారుకు కావాల్సిన మొత్తం రూ.30వేలు మాత్రమే తీసుకుంటే గరిష్ఠ మొత్తం రుణం ఇచ్చినట్టు చూపించి మిగిలిన సొమ్ము ఏంచేశారో తెలియని పరిస్థితి. రుణాలు తీసుకున్న వారు నెలవారీ వాయిదా చెల్లించినా రుణ ఖాతాలో జమ చేయకుండా దారి మళ్లించేశారు. అవకాశం ఉన్న అన్ని మార్గాల్లో దోచేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కుంభకోణంలో సుమారు రూ.80 లక్షల వరకూ స్వాహా చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అంతర్గత ఆడిట్ చేస్తాం..?

ఖాతాదారుల ఆగ్రహంతో సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అక్కడ నుంచి సీన్ పోలీస్ స్టేషన్‌కు మారింది. తమను మోసం చేశారంటూ ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు విచారించగా ఇంటర్నల్ ఆడిట్ చేసుకుని ఖాతాదారులకు న్యాయం చేస్తామంటూ బందన్ బ్యాంకు అధికారులు చెప్పడంతో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం బ్యాంకు అధికారులను హెచ్చరించి పంపారు. ఖాతాదారులకు న్యాయం చేస్తారా నట్టేట ముంచుతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



బాస్కెట్ బాల్ పోటీలు
హోరాహోరీ
లీగ్ దశలో ప్రకాశం, శ్రీకాకుళం జట్లపై పశ్చిమగోదావరి జట్టు విజయకేతనం 7

స్కూటీ, ట్రాక్టర్ ఢీ
తల్లీ కూతుళ్ల మృతి
తూర్పుగోదావరి జిల్లా దొండపూడిలో ప్రమాదం

ఆర్టీసీ బస్సు ఢీకొని ఉల్లిపాయల వ్యాపారి మృతి 7

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
124 గ్రాముల బంగారం, అర కేజీ వెండి స్వాధీనం



వీరవాసరంలో జాతీయస్థాయి
నాటిక పోటీలు
జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సినీ నటుడు శుభలేఖ సుధాకర్ 7



హైస్కూల్ ప్లస్ తరగతులకు
కొత్త అధ్యాపకులు

- హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్ల భర్తీకి ప్రభుత్వం కసరత్తు
- మొగల్తూరు మండలంలో కొత్తగా జూనియర్ కళాశాల

(భీమవరం- ఆంధ్రజ్యోతి)

ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న ప్లస్-2 (ఇంటర్ మీడియట్) విద్యార్థులకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. అధ్యాపకుల కొరతను తీర్చనుంది. జూనియర్ లెక్చరర్లను నియమించాలని ప్రణాళిక రచించింది. ప్రస్తుతం ప్లస్-2 విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో బోధన సిబ్బంది లేరు. ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించి లెక్చరర్లుగా నియమించారు.

వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాల వ్యాప్తంగా 23 ఉన్నత పాఠశాలల్లో ప్లస్ -2 ప్రవేశపెట్టారు. జూనియర్ కళాశాలలుగా గుర్తించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్లస్-2లో చేరేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల నుంచి స్పందన లేకపోవడంతో ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బోధన సిబ్బంది లేకపోవడంతో ప్లస్-2 విధానం పూర్తిగా విఫలమైంది. దానిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

23 కాలేజీలు.. 500 మంది విద్యార్థులు

జిల్లాలోని 23 విద్యాసంస్థల్లో 500 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి బోధన కోసం అధ్యాపకులను సర్దుబాటు చేస్తున్నారు. ఒక విద్యాసంస్థలో పనిచేస్తున్న అధ్యాపకులను వేరే విద్యాసంస్థకు పంపి బోధనకు సర్దుబాటు చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం లేదు. దాంతో ప్లస్-2 కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడంలేదు. జిల్లాలోని 23 కళాశాలల్లో రెండు కళాశాలలకు విద్యార్థినులు చేరలేదు. ఇంకొన్ని కళాశాలల్లో సబ్జెక్టు లెక్చరర్ల కొరత ఏర్పడింది. ప్రయోగశాలలు అందుబాటులో లేకపోవడంతో ప్రవేట్ కళాశాలల ల్యాబ్‌లపై ఆధారపడుతున్నారు. ఇవన్నీ విద్యార్థులకు ఇబ్బంది కరంగా మారాయి. పాఠశాల విద్యలో భాగంగా ఉన్న ప్లస్-2 కళాశాలలను ఇంటర్ మీడియట్ విద్యలో విలీనం చెయ్యాలని ప్రభుత్వం భావించింది. దీనిపై కసరత్తు చేసి విలీనం దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. తాజాగా జూనియర్ లెక్చరర్లను నియమించుకోవాలని సన్నహాలు చేస్తుంది. కొత్త కళాశాలలు ఏర్పాటు నిర్ణయం మేరకు జిల్లాలోని మొగల్తూరు మండలంలో జూనియర్ కళాశాల నిర్మించనున్నారు. లెక్చరర్ల నియమాకంతోపాటు ల్యాబ్‌ల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలి. లేకుంటే ప్లస్- 2 విధానం పూర్తిగా విఫలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

సంక్రాంతికి మినీ గోకులం



మినీ గోకులం షెడ్ పరిశీలిస్తున్న డ్వామా పీడీ అప్పారావు

- జిల్లాకు 900 యూనిట్లు మంజూరు
- 850 ప్రారంభం
- నెల రోజుల్లో మిగిలినవి పూర్తి చేయడానికి కసరత్తు

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు ప్రభుత్వపెద్దపీట వేస్తోంది. పశు సంపదకు పూర్వ వైభవం తీసుకురావాలని చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో సంక్రాంతి నాటికి మినీ గోకులాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అర్హులైన రైతుల నుంచి పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాకు 900 మినీ గోకులాలు మంజూరు కాగా ప్రస్తుతం 850 ప్రారంభ దశలో ఉన్నాయి. వాటిలో 15 మినీ గోకులాలు పూర్తి అయ్యాయి. మినీ గోకులాలు 2, 4, 6 పశువులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించారు. ఇందుకోసం రూ.14.9 కోట్లు మంజూరయ్యాయి. రెండు పశువులతో షెడ్డు వేసుకుంటే రూ.లక్ష మంజూరు చేస్తారు. రైతు వాటా రూ.11,500 చెల్లిస్తే మిగతా సొమ్ము ప్రభుత్వం అందిస్తుంది. 4 పశువులకు రూ.1.85 లక్షలు కాగా 90 శాతం రుణం, 10 శాతం రైతు వాటా. 6 పశువులకు రూ.2.3 లక్షలు కాగా రూ.23 వేలు రైతు వాటా. అదే విధంగా మేకలు, గొర్రెలు పెంపకందారులకు కూడా ఇదే విధంగా రుణాలు మంజూరకు అవకాశం ఉంది.

సంక్రాంతి నాటికి పూర్తి కావాలి

మినీ గోకులాలు సంక్రాంతికి నాటికి పూర్తి కావాలనే లక్ష్యంగా నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రుణాలు మంజూరైన రైతులను సంక్రాతికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాడి అభివృద్ధికి దోహదం

గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద పెంచడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచే దిశగా గోకులాలను మంజూరుచేస్తున్నారు. దరఖాస్తుదారులు నింబధనలకు అనుగుణంగా చేసుకుంటే వాటిని పశు సంవర్ధక శాఖ ఆమోదం అనంతరం డ్వామా ద్వారా నిధులు మంజూరు చేస్తారు. మినీ గోకులాలను డ్వామా పీడీ అప్పారావు పరిశీలిస్తున్నారు. మినీ గోకులాలు పూర్తిస్థాయిలో త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

పశువుల మేతకు రుణం

పశువులకు గడ్డి కోసం రుణాలు మంజూరు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో 10 సెంట్ల నుంచి 50 సెంట్లవరకు స్థలం ఉన్నరైతులకు పచ్చగడ్డి పెంచుకునేందుకు రూ.10 వేలు తగ్గకుండా రుణం ఇస్తున్నారు. 10 సెంట్లు ఉంటే గడ్డి మొక్కలు కొనుగోలుకు రూ.5వేలు ఇస్తారు. అంతే కాకుండా ఉపాధి హామీ పథకంలో సెంట్లను బట్టి రోజులను లెక్కించి వారికి రూ.300 చొప్పున కూలీ ఇచ్చే అవకాశం ఉంది. ఆసక్తి గల రైతులు సంప్రదించవచ్చుని డ్వామా పీడీ అప్పారావు తెలిపారు.



కాకినాడ జేఎన్‌టీయూలో లెక్కింపు ఏర్పాట్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక
ఫలితం నేడే

- కాకినాడ జేఎన్‌టీయూలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు
- 9 టేబుళ్లు.. 14 రౌండ్లు

కాకినాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం తెలిపారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరిగింది. 15,490 ఓట్లు నమోదు కాగా బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూలోని బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించామన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

జేఎన్‌టీయూకేలో బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఇన్, అవుట్ గేట్ల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణును ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు, పోలింగ్ ఏజెంట్లు సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆయన వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వాహనాలను పార్క్‌చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని ఎస్పీ కోరారు. ఆయన వెంట ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఉన్నారు.

గెలిచేదెవరు..?

- ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ
- గోపిమూర్తి, నారాయణరావు మధ్యే ప్రధాన పోటీ ?
- ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు 7



చిన వెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో సుమారు 12 వేల మందివరకూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, వాహనాలతో నిండింది.



గుబ్బల మంగమ్మకు పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఏజెన్సీకి చేరుకున్నారు.వాతావరణంలో మార్పులు కారణంగా భక్తులను ఆలయ కమిటీ వారు సాయంత్రం 3 గంటల దాటిన వెంటనే ఇళ్లకు పంపించి వేశారు.



పుట్టింటికి వచ్చిన అమ్మవారు

పెదవేగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం కూచింపూడిలో వెలగలమ్మ చెరువు వద్ద కొలువై ఉన్న గంగానమ్మని ఆదివారం ఉదయం ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి రామాలయం దగ్గర నిలబెట్టారు. 12 రోజులపాటు పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి నెలవరకు జాతర పూజలు ఉంటాయని చెప్పారు.



పేరుపాలెం బీచ్‌లో సందడి

మొగల్తూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తీక మాసం ఆఖరి ఆదివారం తుఫాన్ కారణంగా సందర్శకులను అనుమతించలేదు. వారం రోజులుగా వాతావరణం అనుకూలించడంతో ఉదయం నుంచి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు విచ్చేశారు..



అపూర్వ కలయిక

కాళ్ల, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. కాళ్ల హైస్కూల్‌లో 1999-2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సుమారు 170 మంది పూర్వ విద్యార్థులు వారి వారి పిల్లలు, కుటుంబ సభ్యులతో విచ్చేశారు.. సాయంత్రం ఆటపాటలతో సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని తీర్మానాలు చేసుకున్నారు.

భగవద్గీత పోటీల్లో సాత్విక్ కు ద్వితీయ బహుమతి



భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలల్లో భీమవరం గునుపూడి ఉమా సోమేశ్వర భగవద్గీత సమాజానికి చెందిన వేలూరి సీతారామ సుబ్రహ్మణ్య శివసాయి సాత్విక్‌కు ద్వితీయ బహుమతి లభించింది. 25న విజయవాడ విశ్వహిందూ పరిషత్ రాష్ట్రశాఖ నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు సాత్విక్ అర్హత సాధించారు. సాత్విక్‌ను యామిజాల ఉమా సోమేశ్వర శర్మ తదితరులు అభినందించారు.

కేంద్ర మంత్రికి యూత్ హాస్టల్ జీవిత సభ్యత్వ కార్డు



భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూత్ హాస్టల్ జీవిత సభ్యత్వ కార్డును ఆదివారం భీమవరంశాఖ యూత్ హాస్టల్ సభ్యులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు అందజేశారు. ఈనెల 15న జరిగే యూత్ హాస్టల్ జాతీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా మంత్రి వర్మ పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. యూనిట్ ఛైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, జానపాటి మధుసూధనరావు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కంతేటి వెంకట్రాజు, సరిపిడకల రామారావు, కుక్కల బాల వెంకట రత్నం, కడలి వెంకటేశ్వరరావు, తాళ్ళపూడి గాంధీ పాల్గొన్నారు.

15న సినిమా పాటల పోటీలు

ఆకివీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సరిగమ.. పాడుతా హాయిగా ద్వారా ఎంతో మంది గాయకులు, కళాకారులను సినీ పరిశ్రమకు పరిచయం చేసినట్టు సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపకుడు సింగవరపు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆకివీడు సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 15న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో సరిగమ పాడుతా హాయిగా 25వ రాష్ట్రస్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉభయ రాష్ట్రాల సినీ ప్రముఖులకు సరిగమ జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రముఖులకు సరిగమ అభినందన పురస్కారాలు, సినీ, తదితర వాటిలో సేవలందించిన వ్యక్తులకు సరిగమ రజతోత్సవ సత్కారాలు ఉంటాయన్నారు. సినీహాస్య నటులచే స్కిట్స్ ఉంటాయన్నారు. సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలి

పెనుగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని సద్గురు గీతాశ్రమ పీఠాధిపతి పూజ్యశ్రీ సత్యానందగిరి స్వామీజీ పేర్కొన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం విజయ గోపాలస్వామి దేవస్థానంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ మండల హిందూ సమ్మేళనం నిర్వహించారు. హిందూత్వానికి అలవా లమైన దేవాయాలకు నేడు రక్షణ లేకుండా పోయిందన్నారు. విగ్రహాలు ధ్వంసానికి గురవు తున్నాయన్నారు. దేవాలయాల్లో దూప దీప నైవేద్యం మరియు కంకైర్యాలు కరవతున్నాయ న్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. హిందు విజయవాడలోజనవరి 5న తలపెట్టిన హైందవ శంఖారావం జయప్రదం చేయాలన్నారు.



రన్‌లో పాల్గొన్న విద్యార్థులు..విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

పరుగు, నడక ఆరోగ్యానికి మంచిది : ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పరుగు, నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, కేవలం శరీరానికి మాత్రమే కాకుండా మెదడుకు కావలసి శక్తిని ఇస్తుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు పట్టణంలో ఆదివారం 'ఊరు మన పరుగు' పేరుతో రన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరి రోడ్డు మీదుగా సాగింది. 3కె, 4కె, 10కె రన్ విభాగంలో విశ్వతేజ నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గ్రామాలే నాటక రంగానికి పుట్టినిళ్లు

జాతీయ నాటక పోటీలను ప్రారంభించిన సినీనటుడు శుభలేఖ సుధాకర్



(వీరవాసరం) భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పూర్వం గ్రామాలే నాటక రంగానికి పుట్టినిళ్ళు అని, తరువాత పట్టణాలకు ఈ కళారంగం చేరిందని, ప్రస్తుతం ఎక్కడా నాటక రంగాన్ని ఆదరించే పరిస్థితులు లేక పోయినా ఈ ప్రాంతంలో నాటకరంగాన్ని పరిరక్షించడానికి కృషి చేయడం అభినందనీయమని సినీ నటుడు శుభలేఖ సుధాకర్ అన్నారు. వీరవాసరం మండలం తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న 20వ జాతీయ స్థాయి నాటిక పోటీల ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివారం కళాపరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నాటక కళారంగాన్ని ఇంతిలా ఆదరించడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, భీమవరం చైతన్య భారతి కళాపరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, వాఖ్యత దాయన సురేష్ చంద్రాజీ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు) పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణ, వీరవాసరం కళా పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, శ్రీకృష్ణదేవరాయ నాట కళాపరిషత అధ్యక్షుడు కేఎస్ ఆర్కే. గోపాలకృష్ణ, తక్కెళ్ళ సత్యనారాయణ, తమ్మినీడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.





నేత్రపర్వంగా అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరుడి ఊరేగింపు

అత్తిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా స్వామి ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. బుట్టబొమ్మలు, బేతాళ నృత్యాలు, కోలాట భజనలు, రామదండు, కేరళా నృత్య ప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు.



గెలిచేదెవరు..?

ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ
గోపిమూర్తికి బలంగా పనిచేసిన యూటీఎఫ్
గత ఎన్నికల్లోనూ పోటీచేసిన గంధం నారాయణరావు
వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ అని ప్రచారం
ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

నిడమర్రు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజ కవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఫలితాలు విడుదల కానున్నాయి. మొత్తం తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 116 పోలింగ్ కేంద్రాల్లో 5న జరిగిన ఎన్నికల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. 16,737 మంది ఓటర్లకు గాను 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన షేక్ సాబ్జీ గతేడాది ఆకివీడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. సాబ్జీ వారసుడుగా తెర మీదకు వచ్చిన యూటీఎఫ్ నాయకుడు భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి పోటీలో ఉన్నారు. పది సంవత్సరాల సర్వీసు వదులుకుని రాజీనామా చేసి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడగా మరోపక్క మిగిలిన 16 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గంధం నారాయణ రావు పోటీలో నిల్చున్నారు. ఐదుగురు అభ్యర్థులు పోటీలో నిలవగా ప్రధానంగా పోటీ మాత్రం వీరిద్దరి మధ్యే ఉంది. సాబ్జీ వారసుడిగా ముందుకు వచ్చిన గోపిమూర్తికి యూటీఎఫ్ అండగా నిలబడింది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అధిక శాతం ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యా యులే నమోదు చేసుకోగా ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు పెద్దగా నమోదు చేసుకోలేదని మొత్తం ఓట్లలో వారివి మూడు వేలే ఉంటా యని అంచనా వేస్తున్నారు. ఇది కూడా గోపిమూర్తి విజయానికి అవకాశాలు ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోపక్క గంధం నారాయణరావు విజయంపై ఆయా సంఘాల నాయకులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు నారాయణ రావుకు ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం. కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల ఓటర్లు ఈయనకు అనుకూలంగా చేశారని ప్రచారం జరుగుతు తోంది. ఓసీ కార్డును ఆయన వర్గీయులు బలంగా నమ్ముకొన్నారు. గతంలో కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆయన పోటీ చేయడం, ఓటర్లు అందరికీ సుపరిచితుడు కావడం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు..

ఫలితాలపై జోరుగా పందేలు

పందెం ఎమ్మెల్సీ ఫలితాలపై కూఆ జోరుగా పందేలు కాశారు. ఎన్నికల ప్రారంభ సమయంలో గోపిమూర్తి - గంధం నారాయణ రావుల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ఆది నుంచి ప్రచారం జరుగు తోంది. మొదట్లో గోపిమూర్తి గెలిస్తే లక్ష రూపాయలు, గంధం నారాయణరావు గెలిస్తే లక్షా 50 వేలు ఇవ్వాల్లి ఉంటుందని పందేలు జోరుగా జరిగాయి. డిసెంబరు 5న ఎన్నికల సరళి చూసిన తర్వాత పందేల సరళి కూడా మారిపోయింది. గోపి మూర్తి మరింత హెచ్చు లోకి వెళ్లినట్లు పందెం రాయుళ్ల వద్ద సమాచారం. దీంతో పందేలు ఒకటికి మూడు రెట్లు అన్నట్టు కాస్తున్నారు. గోపిమూర్తి గెలిస్తే లక్ష, గంధం నారాయణరావు గెలిస్తే 2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుందని పందేలు కాస్తున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల నాటికి ఫలితాలపై ఓ స్పష్టత రావచ్చని విశ్లేకులు చెబుతున్నారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు



పెనుమంట్ర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మార్టేరులో బాస్కెట్ బాల్ అంతర్ జిల్లాల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. పురుషుల విభాగంలో విశాఖపట్నం -నెల్లూరు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం గెలుపొందింది. అనంతపురం-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం గెలుపొందింది. గుంటూరు -కడప జట్ల మధ్య జరిగిన పోటీలో గుంటూరు గెలుపొందింది. కృష్ణా - విజయవాడ జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జిలా, చిత్తూరు- కర్నూలు మధ్య జరిగిన పోటీలో చిత్తూరు గెలుపొందింది. మహిళల విభాగంలో కృష్ణ- కర్నూలు జట్ల మధ్య జరిగినపోటీలో కృష్ణా జిల్లా విజయం సాధించగా పశ్చిమగోదావరి ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో పశ్చిమ గోదావరి జిల్లా విజయం,తూర్పుగోదావరి - కడప జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా విజయం సాధిం చింది. చిత్తూరు జిల్లా- శ్రీకాకుళం జిల్లా మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు గెలుపొందింది. విశాఖపట్నం-కర్నూలు పోటీలో విశాఖపట్నం గెలుపొం దింది. పశ్చిమగోదావరి జిల్లా శ్రీకా కుళం జట్లు మధ్య జరిగిన పోటీలో పశ్చిమ గోదావరి గెలుపొందింది. నేడు సెమీ ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



పాఠశాల విద్య ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లాశాఖకు ఎన్నికైన నాయకులు, తదితరులు

పాఠశాల విద్యాశాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

ఏలూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఎన్నికలు ఆదివారం ఏలూరులో జరిగాయి. సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.క్రాంతి కిరణ్, పి.కుమారస్వామి ఎన్నికయ్యారు. సహ అధ్యక్షుడిగా ఎం.పవన్‌కుమార్, కోశాధికారిగా ఎం.వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ.సుధాకర్, మహిళా విభాగం కార్యదర్శిగా ఝాన్సీ రాణిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఐదుగురిని, జాయింట్ సెక్రటరీలుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో సంఘ రాష్ట్ర అధ్యక్షులు పద్మకుమారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా కె.రాజకుమారి, టి.శ్రీనివాస్ వ్యవహరించారు. సంఘ రాష్ట్ర నాయకులు హుస్సేన్, ఏ.శ్యామ్యూల్, కె.ఎస్.ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు

భయపెడుతున్న రక్తపింజరులు





ఆకివీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పాట్రిక్‌నగర్‌లో రక్తపింజర్లు భయపెడుతున్నాయి. ఆదివారం రైతులు రక్తపింజరను చంపారు. పొదులో ఉండడాన్ని గమనించిన స్థానికులు రైతులతో కలిసి చంపారు. ఈ ప్రాంతం సమీపంలో పొలాలు, ఆక్వా చెరువులు, కాలువలు ఉండడంతో నిత్యం జనసం చారం ఉంటుంది. రైతులు పాకలు ఏర్పాటు చేసుకొని పశువులను పెంచుతుంటారు. రాత్రులు కూడా తిరుగుతారు. ఇటువంటివి వారానికొకసారి జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు

క్రైమ్ కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



సానబోయిన రమేష్ (ఫైల్)

భీమవరం క్రైం,డిసెం బరు 8, (ఆంధ్రజ్యోతి): ఎదు రెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు భీమవరం రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపారు. భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన సానబోయిన రమేష్ (35), కపురు వాసు, మరో ఇద్దరు స్నేహితులు కలసి శనివారం రాత్రి రెండు బైక్‌లపై భీమవరం సినిమాకు వస్తున్నారు.యమునాపల్లి గ్రామం వద్దకు వచ్చేసరికి జుత్తిగ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి వెంప వైపు వెళుతున్నారు. ఈ రెండు బైక్‌లు ఢీకొనడంతో సానబోయిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న వాసుకు స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్, ఆటో తగుల బెట్టారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): తన ఇంటికి ముగ్గురు వ్యక్తులు వచ్చి తలపై కొట్టి, ఇంటి ముందు ఉన్న బైక్, ఆటోను తగలబెట్టారంటూ బీసీ కాలనీకి చెందిన గేదెల లక్ష్మణరావు టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. లక్ష్మణరావు తన కుటుంబంతో శనివారం రాత్రి నిద్రపోయారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బొల్లా కృష్ణ, బొల్లా రాము, బొల్లా శంకర్ అనే వారు ఇంటికి వచ్చి తలుపులు కొట్టారు. తలుపు తీసిన వెంటనే తలపై ఇనుప రాడ్డుతో కొట్టి ఆటో, బైక్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రహ్మాన్ తెలిపారు.



వివరాలు తెలుపుతున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

124 గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం

భీమవరం క్రైం, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) చెడు వ్యసనాలకు బానిసైన ఒక వ్యక్తి 20 ఏళ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఆదివారం భీమవరం రెండవ పట్టణ పోలీసులకు ఒక క్లబ్ వద్ద ఖాళీ ప్రదేశంలో పట్టుబడ్డాడు. ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో భీమవరం డీఎస్పీ జయసూర్య వివరాలు వెల్లడించారు. పెంటపాడు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి సీతారాముడు పేకాట, తాగుడు వంటి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు.డబ్బుల కోసం తాళాలు వేసి ఉన్న ఇళ్ళలోనూ, రోడ్డు పక్కన ఉన్న షాపుల్లోనూ చోరీలు చేయడం అలవాటు చేసుకున్నాడు. గణపవరం, పెదపాడు, రావులపాలెం, అత్తిలి, పెంటపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలు చేశాడు. ఈ ఏడాది జూన్ నెలలో భీమవరం ఏఎస్ఆర్ నగర్ చింతలపాటి వెంకట సత్యనారాయణరాజు ఇంట్లో చోరీ చేశాడు. ఆగస్టులో పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో అర్ధరాత్రి సమయంలో దోపిడీ చేశాడు. అదే నెలలో భీమవరం బలుసుమూడి ఏరియాలో డి.వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుకొట్టి బంగారం, నగదు దోచుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భీమవరం ఆదర్శ్ నగర్‌లో దండు రంగరాజు ఇంట్లో బంగారం, వెండి దోచుకున్నాడు. కొన్ని రోజుల క్రితం రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు చెయ్యగా జూలై నెలలో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ అత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడగా అత్తిలి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించగా బెయిల్‌పై బయటకు వచ్చి ఆదివారం భీమవరం పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద 124 గ్రాముల బంగారు వస్తువులు, అరకేజీ వెండి వస్తువులు (విలువ రూ. 8,85,000) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. భీమవరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు రెహ్మాన్, వీర్రాజు, ఇజ్రాయిల్, సిబ్బంది గోవింద్, గోపి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఉల్లిపాయల వ్యాపారి మృతి

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35), శ్రీరాముల దుర్గారావు ఊరూరా తిరుగుతూ ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేస్తుంటారు. కొవ్వూరు మండలం పంగిడిలో ఆదివారం ఉల్లిపాయలు విక్రయించుకుని కాపవరం వైపు వస్తుండగా కాపవరం జంక్షన్‌లోని రాళ్ళమడుగు వంతెనపై నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్, ఉల్లిపాయలు విక్రయిస్తున్న ఇద్దరు కిందపడిపోయారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం ఆసుపత్రిలో మృతిచెందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం దుర్గారావును జీఎస్ఎల్‌కు తరలించారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతుళ్ల మృతి

పోలవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పోలవరం మండలం బండార్లగూడెం గ్రామానికి చెందిన తల్లీ కూతుళ్ళు మృతి చెందారు. పోలవరం మండలం బక్కబండార్లగూడెం గ్రామానికి చెందిన కురసాని కాంతమ్మ (45) కవలం గన్నమ్మ (75) ఉదయం దొండపూడి గ్రామం నుంచి కుంకాల రోడ్డులో స్కూటీపై వెళుతుండగా అదే రోడ్డులో ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్‌ని ఢీకొట్టి ట్రాక్టర్ కిందపడడంతో వారిద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని అటుగా వస్తున్న ఆటోలో ఎల్ఎన్‌డీ పేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి 108 వాహనంలో వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కాంతమ్మ మృతి చెందగా, కాంతమ్మ తల్లి గన్నమ్మను ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తల్లీకూతుళ్ళ మృతితో బండార్లగూడెంలో విషాదం అలుముకుంది

గో వధ కర్మాగారానికి అనుమతివ్వలేదు

» తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

ఇరగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తణుకు మండలం తేతలి గ్రామంలో గో, పశువధ కర్మాగారానికి కూటమి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్న మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు వ్యాఖ్యలను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఖండించారు. ఆదివారం తణుకులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆ కర్మాగానికి గత ప్రభుత్వ హయాంలో ఉన్న అనుమతులు తప్ప కొత్తగా కూటమి ప్రభుత్వంలో అనుమతులు రాలేదని, కర్మాగారంపై కోర్టులో ఉన్న స్టే వెకేట్ అయిందని తెలిసిన వెంటనే అధికారులను పిలిచి ప్రశ్నించామన్నారు. రాబోయే రెండు రోజుల్లో కర్మాగారం విధి విధానాలు, కర్మాగారంలో చట్ట విరుద్ధంగా ఏమైనా కార్యక్రమాలు జరుగుతుంటే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కర్మాగారానికి కూటమి అనుమతులు : కారుమూరి

తేతలి గ్రామంలో గో, పశువధ కర్మాగారాన్ని వెంటనే ఆపాలని మాజీ మంత్రి కారుమూరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజుకి 400 పశువులను వధించే ఈ కర్మాగారం వల్ల అక్కడి వారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పశువధ కర్మాగారాన్ని ఆపివేయగా కూటమి ప్రభుత్వం అనుమతులు ఇచ్చి గో, పశువధను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు.



మాజీ సైనిక సంక్షేమ నిధి కోసం విరాళాలు అందిస్తున్న విద్యార్థులు

సైనికుల త్యాగాలు మరువలేనివి

పెంటపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు అన్నారు. జాతీయ సాయుధ దళాల వేడుకను పురస్కరించుకుని ఆదివారం అలంపురంలోని టీబీఆర్ సైనిక్ స్కూల్ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికుల త్యాగాలను విద్యార్థులందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం మాజీ సైనిక ఉద్యోగ కుటుంబాల సంక్షేమ నిధి కోసం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అంజిబాబును సత్కరిస్తున్న మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

పీఏసీ చైర్మన్ అంజిబాబుకు ఘన సత్కారం

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన పీఏసీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో కోస్టల్ సిటీ సెంటర్ వద్ద ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కారుమూరి సత్యనారాయణమూర్తి, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కొత్త శ్రీనివాస్, కోట్ల నాని మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో ఎన్నికైన అంజిబాబుకు కీలకమైన పదవి ఇవ్వడం సముచితమన్నారు. బొండా హనుమంతరావు, చలపతి శ్రీనివాస్, బొండాడ బంగార్రాజు, జూలూరి రాజా, కనగర్ల రామ కృష్ణ, బంగారు రాము క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏలను విధుల్లోకి తీసుకోండి

భీమవరంటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్ (మేల్) ఉద్యోగులను తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు తొలగించడం అన్యాయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, కార్యదర్శి పీఎస్ చంద్ర మౌళి, అసోసియేట్ అధ్యక్షుడు వై.మోహన్‌రావు ఖండించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీవో నంబరు 273 జీవో ప్రకారం కొంతమంది ఉద్యోగులను తీసివేయగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ సబ్ కమిటీ మానవతా దృక్పథం 2013లో నంబర్ వన్ టు జీరో సెవెన్ (1207)విడుదల చేసి సుమారుగా 1200 మందిని విధులలోకి తీసుకున్నారన్నారు. ఆ జీవో ఆధారంగా మరికొంతమంది 2014లో కోర్టుకు వెళ్లగా వారిని కూడా కన్సిడర్ చేయమని కోర్టు తీర్పు మేరకు మరి కొంతమందిని ఏపీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ తరుణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం 90 రోజుల్లోగా టెర్మినేట్ చేయవలసి ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల్లోనే 160 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వారందరినీ మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

5న హైందవ శంఖారావంలో అందరూ పాల్గొనాలి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం కార్యక్రమం జనవరి ఐదో తేదీన నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ పాల్గొని హిందూ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుధవారపు వీధిలోని కొత్త రామాలయంలో మహిళల ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వీహెచ్‌పీ రాష్ట్ర మహిళా ప్రముఖ్ తొట్టెంపూడి సునీత అధ్యక్షత వహించారు. చిన్న గోపురం మాజీ చైర్మన్ గాదె వెంకన్న, ప్రవచన కర్త శశికాంత్ ఆచార్యులు, సత్సంగ్ ప్రముఖులు బంగారు మణి, తులసి, కల్పన, సువర్చల, నాగేశ్వరి, యాళ్ళ ప్రసాద్ పాల్గొన్నారు.

సంఘాలు మరింత అభివృద్ధి చెందాలి

నరసాపురం టౌన్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార సొసైటీ సంఘాలు మరింత అభివృద్ధి చెందాలని ప్రభుత్వ విప్ నాయకర్ అన్నారు. ఇటీవల సొసైటీ సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షులు, కమిటీ సభ్యుల్ని ఆయన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లో ప్రతి సభ్యుడు సొమ్మును పొదుపు చేయాలన్నారు. దీనివల్ల సంఘంలో ఎవరికైనా సాయం చేయవచ్చన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, రుణాలు, పడవలు ప్రతి సొసైటీకి వచ్చేలా చూస్తామన్నారు. సొసైటీ ఎన్నికల్లో సభ్యుల విజయానికి కృషి చేసిన మత్స్యకారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఒడుగు ఏసు, తిరుమాని వెంకట్రాజు, మైలా వసంతరావు, వాతాడి జగన్నాదం, కొల్లాటి రాంబాబు, భాస్కరరావు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు ‘ఉందుర్తి’ అంత్యక్రియలు

ఇరగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తణుకు డంపింగ్ యార్డుకు చెందిన భవానీ అనే మహిళ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించడానికి స్థోమతులేని ఆ కుటుంబానికి ఉందుర్తి పాల్ ఫౌండేషన్ అండగా నిలిచి అంత్యక్రియలు నిర్వహించింది. దున్న అమర్‌బాబు, నేకూరి తరుణ్, విప్పర్తి చెర్రీ, పసాల నాని, టి.అఖిల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సిబ్బందితో శశి విద్యాసంస్థల చైర్మన్ వేణుగోపాలకృష్ణ

శశి కళాశాలకు ‘నాక్ ఏ ప్లస్’ గుర్తింపు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ విద్యా సంస్థకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) నుంచి ఏ ప్లస్ గ్రేడ్ అందుకుంది. గతనెల 22,23 తేదీల్లో నాక్ బృంద సభ్యులు కళాశాలలో విద్యానాణ్యత, అధ్యాపకులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలు పరిశీలించిన అనంతరం సంస్థ అవార్డుకు ఎంపికచేసినట్టు ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో మెరుగైన ర్యాంకుల్లో ఒకటిగా నిలవడం వెనుక విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం సంస్థ విశేషమైన చర్యలు కారణమని సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. శశి సంస్థకు నాక్ గుర్తింపు రావడం పట్ల ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఇరగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం తణుకు శర్మిష్ట సెంటర్ వద్ద జరిగింది. 90 శాతం గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. మెరుగైన వైద్యానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదానీని అరెస్టు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): వేల కోట్ల రూపాయల కుంభకోణంతో ప్రజలను మోసం చేసిన అదానీని అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ వద్ద ఆదివారం పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, ఎస.శేషు పాల్గొన్నారు.



తైవాన్ జామ మొక్కలు అందిస్తున్న సత్తిబాబు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నరసాపురం రూరల్. డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీడీపీ నాయకుడు ప్రభుదాస్ కోరారు. ఆదివారం చిట్టవరం మాజీ సర్పంచ్ పోలిశెట్టి నాగలీల వర్ధంతిని పురస్కరించుకుని ఆమె భర్త సత్తిబాబు మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో తైవాన్ జామ మొక్కలు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధ్యానసాధనతో మనలోపాలు మనకు తెలుస్తాయని వాటిని సరిచేసుకుని జీవనాన్ని సాగించవచ్చని ఏలూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ నంబూరి సావిత్రి అన్నారు. వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీతారామస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యకమంలో ఆమె మాట్లాడారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద.. అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు ఆదివారం రాత్రి చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా కొంతకాలంగా అక్రమంగా పాకలు వేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్న డాక్యుమెంట్ రైటర్ల పాకలను రెండు రోజుల క్రితం కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది తొలగించారు. డాక్యుమెంట్ రైటర్లు తాడేపల్లిగూడెంకు చెందిన ఒక బిల్డర్‌తో ఒప్పందం కుదుర్చుకుని రాత్రికి రాత్రే షెడ్ల నిర్మాణానికి తెగబడ్డారు. ఇది గుర్తించిన ఆర్డీవో కతీబ్ కౌసర్‌బాను ఆదేశాలతో తహసీల్దార్ సునీల్‌కుమార్, వీఆర్‌వోలతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం అక్రమ నిర్మాణాల కోసం తీసుకువచ్చిన భవన నిర్మాణ సామగ్రిని సీజ్ చేసి పనులను నిలుపుదల చేశారు. సోమవారం దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

మాలధారులకు అన్నదానం అభినందనీయం



మురళీకృష్ణంరాజును సత్కరిస్తున్న స్వాములు

పాలకోడేరు, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) : పాలకోడేరులో మాలలు ధరించిన స్వాములకు వారి దీక్షాకాలం అన్ని రోజులు అన్నదానం చేయడం అభినందనీయమని పాలకోడేరుకు చెందిన స్వాములు అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన స్వాములందరూ కలసి కునాథరాజు మురళీకృష్ణంరాజు- కృష్ణకుమారి దంపతులను సత్కరించారు. గ్రామానికి చెందిన సుమారు 120 మంది అయ్యప్పమాలలు, భవానీ మాలలు, శివ మాలలు ధరించి పూజలు నిర్వహిస్తున్నారు. దీనిని గుర్తించిన టీడీపీ నాయకుడు కునాథరాజు మురళీకృష్ణంరాజు 120 మందికి దీక్షాకాలంలో సరిపోయేంత ఆహారాన్ని అందించి భక్తిని చాటుకున్నారు.



బూత్ కన్వీనర్లను సన్మానిస్తున్న మంత్రి నిమ్మల, అంగర.. సభ్యత్వ నమోదులో టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని

టీడీపీ సభ్యత్వంలో పాలకొల్లు థర్డ్..

» మరింత కష్టపడి ఫస్ట్ సాధిద్దాం

» మంత్రి డాక్టర్ నిమ్మల

పాలకొల్లు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదులో పాలకొల్లు మూడోస్థానంలో ఉందని మరింత కష్టపడి మొదటి స్థానంలో నిలుద్దామని బూత్ కన్వీనర్లకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక క్లాత్ మర్చంట్స్ భవనంలో టీడీపీ సభ్యత్వ నమోదులో 90శాతం పూర్తిచేసిన బూత్ కన్వీనర్లను, ముఖ్యనాయకులను మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగే నీటి సంఘాల ఎన్నికల్లో పనిచేసే నాయ కులకే పట్టం కట్టేలా నాయకులు, కార్యకర్తలు దృష్టి పెట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, బొప్పన హరికిషోర్, పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలి : గన్ని

గణపవరం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి, ప్రజల శ్రేయస్సుకు టీడీపీ సేవలు ఎంతో అవసరమని సభ్యత్వ నమోదును ఉద్యమంలా కొనసాగించాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గణపవరం మండల టీడీపీ కార్యకర్తలను ఆయన అభినందించారు. కార్యకర్తలు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. గణపవరం మండలంలో పది వేల సభ్యత్వాల నమోదు దాటిందని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ల సుబ్బారావు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, ముత్యాల వేణుగోపాల